వైభవంగా లక్ష తులసి పుష్పార్చన


శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శయన ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా లక్ష తులసి పుష్పార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అయ్యలూరి రఘునాథం, అర్చకులు, రాజకీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఆషాడమాసం సందర్భంగా మండలంలోని మూలమళ్లలోని పాండురంగ స్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆత్మకూర్ శివారులోని మల్లాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రముఖ వేదపండితులు వెంకటశేషశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధి గాంచిన రంగనాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ బిందెలో కృష్ణానది జలాన్ని ఆలయానికి తీసుకొచ్చారు. 108 కళశాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకాభిషేకాన్ని జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే పెబ్బేరు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సూగూరులోని రామాలయంలో తొలి ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


వనపర్తిలో..


మూలమళ్లలో పూజలో పాల్గొన్న భక్తులు


పెబ్బేరు వేణుగోపాలస్వామి గుడిలో..

పండుగ సాయన్నకు ఘన నివాళి


ఆత్మకూర్‌లో పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వనపర్తి టౌన్: భూస్వాములు, పెత్తందార్ల గడుల్లోని ధనధాన్యాలను దోచి పేదలకు పంచిన బహుజన పోరాట యోధుడు, తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న పోరాటాలు మరువలేనివని ప్రజా వాగ్గేయకారాడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. పండుగ సాయన్న 133వ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, నాగరాజు, దేవన్ననాయుడు, ఇటిక్యాల బండలయ్య, రాములు, బాలేమియా, కళాకారుడు నరసింహ, నిదర్శన్‌గౌడ్, శివ, సత్యం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ముదిరాజ్‌ల ఆరాధ్యుడు పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక గాంధీచౌక్‌లో ముదిరాజ్ సంఘం, మత్స్యకారుల సంఘాల ఆధ్వర్యంలో పండగ సాయన్న చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, గడ్డమీది శ్రీను, వెంకటన్న, బాలు, నర్సింహ, నాగరాజు, రాజు, పరశురాం, అంజి, శ్రీను పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


నవీన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


కేతేపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న గ్రామానికి చెందిన పసుపుల ఖాసీం నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం అతడి మిత్ర బృందం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ తాము జమ చేసిన రూ.61,500 నగదు, క్వింటాల్ బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ భవిష్యత్తులో సాయం అందిస్తామని మిత్ర బృందం భరోసా ఇచ్చారు. ఆర్థికసాయంగా అందజేసిన నగదును పిల్లల చదువుకు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మిత్ర బృందం మౌలాలి, రాముడు, వెంకటస్వామి, రాజశేఖర్, వెంటేశ్వరచారి, శివశంకర్, యువరాజు, రమేష్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన బొగ్గు శ్రీనివాసులు కుమారుడు నవీన్‌కు ఐఐటీలో సీటు సాధించాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని చింతకుంట మండలం ధమగ్నాపురం గ్రామంలోని ఆయన నివాసంలో కలిసి నవీన్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చదువుల ఖర్చు నిమిత్తం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆదేవిధంగా వడ్డెవాట మాజీ ఎంపీటీసీ ఉదరి వెంకటన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వివరించగా అతడికి రూ.5వేలు అందజేశారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సత్యన్న అనే రైతు ఐదేళ్ల క్రితం మృతి చెందగా.. రైతుబీమా చెక్కు వచ్చే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, అచ్చిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాంలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ఉంటేనే గుర్తింపు


చీర్ల శ్రీనివాసులును సన్మానిస్తున్న సాహితీవేత్తలు

వనపర్తిటౌన్: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో చేరిన నాటి నుంచి ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేస్తేనే అత్యున్నత గుర్తింపు వస్తుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే రిటైర్ అయిన చీర్ల శ్రీనివాసులును బుధవారం వనపర్తిలోని ఆయన నివాసంలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే ప్రతి ఉద్యోగానికి వన్నె తేవాలంటే, కార్యచరణలో కవ్వింపు చర్యలకు దూరంగా ఉంటూ కష్టపడేతత్వాన్ని అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, సత్తార్, బండారు శ్రీనివాస్, పోచ రవీందర్‌రెడ్డి, శ్యామ్ సుందర్, గంధం నాగరాజు, రామిరెడ్డి, రవికుమార్ యాదవ్, బుచ్చిబాబు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ఆత్మకూర్: అపరచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇవ్వకూడదని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా వివిధ గ్రామాలకు చెందిన, స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పమని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఫొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలంటూ భయపెడితే అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు బీచుపల్లి, రోషన్న, సిబ్బంది యుగంధర్, బాలరాజు, స్థానికులు ఉన్నారు.

గుంతలమయంగా శాగాపూర్ రోడ్డు

పాన్‌గల్: మండల కేంద్రం నుంచి శాగాపూర్ గ్రామానికి వెళ్లే పీఆర్ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. 5 కిలోమీటర్ల రోడ్డు గుంతలుగా మారి చినుకు పడితే గుంతల్లో వర్షపు నీరు చేరి బురదమయంగా మారింది. రోడ్డుపై గుంతలు ఉన్న విషయం దగ్గరికి వచ్చే వరకు తెలియక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



పెబ్బేరు రూరల్: వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌గౌడ్‌కు జిల్లా అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్, కౌన్సిలర్ బ్రహ్మచారి, టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాష, గంధం రాజారాంప్రకాష్, మాలపల్లి రామన్‌గౌడ్ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

మదనాపురం: వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌గౌడ్‌ను బుధవారం మాజీ ఎంపీపీ అక్కల మహాదేవన్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, సాయిబాబా, రాములుగౌడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంతా.. బురదమయం


కాటవరం శివారులోని కాటన్ మిల్లు సమీపంలో దాబాల వద్ద దుస్థితి


కాటవరం తండా స్టేజీ ఎదురుగా..

అడ్డాకుల: మండల పరిధిలో 44వ నంబర్ జాతీయ రహదారిపై అక్కడక్కడా వర్షాలకు ఏర్పడుతున్న బురద వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని పలుచోట్ల రహదారి పైకి బురద వస్తోంది. దాబా హోటళ్ల వద్ద నిలిచే భారీ వాహనాలతో రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి వాటిలో చేరే వర్షం నీటితో సమస్య తలెత్తుతోంది. వాహనాలు రోడ్డు పక్క నుంచి రోడ్డుపైకి వచ్చే క్రమంలో బురద రోడ్డుపైకి రావడంతో రోడ్డుపై ఉండే చివరి వరుస కనిపించడం లేదు. కాటవరం తండా స్టేజీ ఎదురుగా, కాటన్ మిల్లు సమీపంలో, శాఖాపూర్ వద్ద ఇటు హైదరాబాద్, అటు బెంగళూర్ రోడ్డుపై బురద ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రివేళ రోడ్డుపై బురద వల్ల చివరి వరుస గుర్తు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రహదారిపై బురద ఉన్న చోట ఆటోలు, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నాయి. శాఖాపూర్ వద్ద రహదారిపై ఏర్పడిన బురద కరిగెటను తలపిస్తోంది. రహదారి నిర్వాహకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

చిన్నచింతకుంట: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం దమగ్నాపురంలో దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదింటి ఆడపడుచులకు పెళ్లిళ్లు చేసేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ పథకం వర్తిస్తుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. విపక్షాలు రుణమాఫీపై రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్ల తహసీల్దార్ ఎల్లయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా రైతువేదిక

మానవపాడు: మండలకేంద్రంలోని రైతువేదిక మందుబాబులకు అడ్డగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కడ మద్యం తాగిన సీసాలు దర్శనమిస్తున్నాయి. రైతువేదిక చుట్టూ అపరిశుభ్రంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మదనాపురం: నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజలకు సేవలు చేస్తూ నియోజకవర్గంలో రేయింబవళ్లు కష్టపడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రకటనలు చేయడం పద్ధతి కాదని మాజీ ఎంపీపీ అక్కల మహాదేవన్‌గౌడ్, కురుమూర్తి పాలక మండలి మాజీ సభ్యులు గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ సమయంలో సరళాసాగర్ నీరు వదిలారని ప్రశ్నించారు. కృష్ణానదిలో, రామన్‌పాడు నీళ్లు లేకుండా ఇబ్బంది పడుతూ.. వర్షాల కోసం, పైనుంచి వచ్చే వరదల కోసం ఎదురుచూస్తున్నారని, ఇలాంటి సమయంలో హాస్యాస్పదమైన ప్రకటనలు చేస్తే ప్రజలు నవ్వుకుంటారని మండిపడ్డారు. కృష్ణానదికి వరద వస్తే రామన్‌పాడు నింపి సరళాసాగర్ నింపడం ఆనవాయితీగా ఉందన్నారు. లిఫ్టు నుంచి నీరు వదలకుండానే నారు మడులు ముదిరిపోతున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మీ తప్పుడు విధానాలకే ప్రజలు తిరస్కరించారని, అధికారం పోయి ఆరు నెలలు పూర్తి కాకముందే అధికారం లేక ప్రజల మధ్య ఏదో అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు గౌడ్, గోపాల్ రెడ్డి, రాములు, సాయిబాబా, రంగన్న, శ్రీధర్‌రెడ్డి, విజయ్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారిణి



వనపర్తి టౌన్: ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు కేరళలోని కొల్లం జిల్లాలో నిర్వహించే సౌత్ జోన్ సబ్ జూనియర్ హాకీ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జాతీయ జట్టుకు జిల్లా క్రీడాకారిణి ఎ.వర్షిణి ఎంపికైనట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. వర్షిణి గతేడాది సబ్ జూనియర్ జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొన్నారని, హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వర్షిణి మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో గెలుపొంది తెలంగాణ జట్టుకు, వనపర్తి జిల్లా గొప్ప పేరును తీసుకొస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహేంద్రనాథ్ విగ్రహావిష్కరణ



పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ స్టేజీ వద్ద మాజీ మంత్రి మహేంద్రనాథ్ విగ్రహాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, మాజీ డీజీపీ రవీంద్రనాథ్‌లు బుధవారం ఆవిష్కరించారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసిన మహేంద్రనాథ్‌ను ప్రస్తుత రాజకీయనాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమేష్, తిరుమల్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: హిందూముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మొహర్రం పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో చేసుకుంటారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టలోని ఇమామ్ హుస్సేన్ పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దట్టి సమర్పించారు. తొమ్మిది రోజులుగా చావి డీల్లో కొలువుదీరిన పీర్లకు బుధవారం గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు పానకం, మాలిద ముద్దలు సమర్పించారు. కొందరు భక్తులు చావిడీల వద్ద కోళ్లు, పొటేళ్లు బలిచ్చి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావ్మోహన్‌రెడ్డి, లక్కాకుల సతీష్, చీర్ల విజయచందర్, మహేష్, వెంకటయ్య యాదవ్, నందిమల్ల అశోక్, బండారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వనపర్తి పీర్ల గుట్టపై మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి


దుప్పల్లిలో..


అమరచింతలో..


పిన్నంచర్ల గ్రామంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


పాన్‌గల్‌లో..

క్లుప్తంగా

నేడు స్టడీ మెటీరియల్ పంపిణీ

పెబ్బేరు రూరల్: కొత్తకోట మండలంలోని మిరాసిపల్లికి చెందిన గొల్ల సాయమ్మ తృతీయ వర్ధంతి పురస్కరించుకొని, ఎస్‌ఏ బీయూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో గ్రూప్–2, 3 మెటీరియల్ పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ పద్మరాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్ 2, 3 పరిక్షలు రాసే విద్యార్థులు ఉదయం 10 గంటలకు కళాశాల వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సుంకులమ్మ ఆలయానికి విరాళం



పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణంలోని గ్రామ దేవత సుంకులమ్మ ఆలయ కంపౌండ్ నిర్మాణం కోసం పెబ్బేరు పట్టణానికి చెందిన సంబు కృష్ణయ్య, ఎస్ రామేశ్వర్‌రెడ్డి రూ.1,0116 విరాళం ప్రకటించారు. అందులో భాగంగా బుధవారం రూ.50 వేలు విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. దాతలకు పెబ్బేరు పట్టణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

మహిళా హక్కులు పరిరక్షించాలి



పాన్‌గల్: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదగౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్, మండల వాసి డా.కేతూరి వెంకటేష్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యానికి తమ హయాంలో ప్రాధాన్యత పెరుగుతుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహిళా హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి



ఖిల్లాఘనపురం: వడ్డెరల సమస్యలు పరిష్కరించాలని ఎంబీసీ చైర్మన్ జెరుపటి జైపాల్‌ను వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డె భూమయ్య కోరారు. నూతన చైర్మన్‌గా ప్రమాణం చేసిన ఆయనను శాలువాతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం వడ్డెరులను గుర్తించి రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా జైపాల్‌ను నియమించడం హర్షించదగినదన్నారు. వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం హర్షం వ్యక్తం చేశారు. వడ్డెర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, బలరాం, మల్లేష్, శివ, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ఆత్మకూర్: పట్టణంలోని మినీ స్టేడియంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 12 జట్లు తలపడగా మినీ స్టేడియం జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకోగా.. విరాట్ టీం రెండో బహుమతిని సాధించింది. తహసీల్దార్ నరేందర్, శ్రీనివాస మెడికల్స్ అధినేత చెట్ల శ్రీనివాసులు విజేతకు రూ.5వేలు నగదు, రన్నర్‌కు రూ.3 వేలు నగదు షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నగేష్, మహేందర్, రాజేష్, అఫ్రోజ్, శ్రీధర్, క్రీడాకారులు ఉన్నారు.

మొక్కలు సంరక్షించాలి



ఖిల్లాఘనపురం: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీజేపీ మండల నూతన అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో అప్పారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల, ఆలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మొక్కలు నాటాలని రాష్ట్ర కమిటీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈదమ్మ, శేషయ్య, మండల యువమోర్చా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.